క్లుప్తంగా

ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ధర్మారంలో ఎమ్మెల్యే సామేల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మద్దిరాల : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన మందుల సామేల్‌ను మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ధర్మారం గ్రామంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు ఎల్లు అశోక్‌రెడ్డి, కుందూరు చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌కు సన్మానం

అర్వపల్లి : తుంగతుర్తి అసెంబ్లీ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన మందుల సామేల్‌ను జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. తిమ్మాపురం–కోడూరు రోడ్డు విస్తరణతోపాటు ఈ రహదారిపై వాగుల వద్ద వంతెనల నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

చిరుధాన్యాలపై నేడు అవగాహన సదస్సు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురంలో బుధవారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరు ధాన్యాలు, ఉత్పత్తులపై ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే



సర్వే చేస్తున్న సీఆర్‌పీ వెంకట్‌రెడ్డి

అర్వపల్లి : బడి బయట ఉండే, మధ్యలోనే చదువు మానేసిన పిల్లలను గుర్తించడానికై తిమ్మాపురం, అడివెంల గ్రామాల్లో తిమ్మాపురం క్లస్టర్ సీఆర్‌పీ రామిడి వెంకట్‌రెడ్డి మంగళవారం రెండవ రోజు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వివరాలను తెలుసుకొని సర్వే ఫారాల్లో నమోదు చేసుకున్నారు. అన్ని గ్రామాల్లో సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు సర్వే చేస్తున్నట్లు చెప్పారు.


కోతుల బెడదతో కష్టాలు



కొత్తగూడెంలో ధాన్యం రాశిపై ఉన్న కోతులు

తుంగతుర్తి : కోతుల బెడదతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. గింజ వేసినప్పటి నుంచి పంట ఇంటికి చేరే వరకు కోతులు రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాకుండా ధాన్యాన్ని ఆరబోసినా రాశులపై కోతులు మందలుగా చేరుతున్నాయి. కోతుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని తహసీల్దార్ సరిత అన్నారు. మండల కేంద్రంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చావా శైలజ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్‌ఐ మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీను, ఆలయ పూజారి రజనీకాంత్ ఆచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, సింధూరం, తమలపాకు పూజ, శాంతి కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి డ్రైఫ్రూట్స్ (జీడిపప్పు, బాదం, ఖర్జూర, కిస్మిస్) ప్రత్యేక అలంకరణ చేశారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం

- పల్లెల్లో చేపట్టని ఫాగింగ్
- దోమలతో అల్లాడిపోతున్న జనం
- నిధుల లేమితో సర్పంచ్‌ల ఆవేదన



జాజిరెడ్డిగూడెంలోని ట్యాంక్ బజారులో కంపచెట్లతో నిండిన మురుగు కాల్వ



లోయపల్లిలో..



వేల్పుచర్లలో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అపరిశుభ్ర పరిసరాలతో గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం దోమల నివారణకు చర్యలు చేపట్టకపోవడంతో రాత్రివేళల్లో కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కుడుతుండటంతో విషజ్వరాల బారిన పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. మురుగు కాలువలు ఎక్కడికక్కడ పూడిపోవడం, వీధుల్లో చెత్త పేరుకపోవడం, కంపచెట్లు పెరగడంతో పారిశుద్ధ్యలోపం సమస్య ఏర్పడుతోంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఫాగింగ్ చేపట్టడంలో నిర్లక్ష్యం..

జాజిరెడ్డిగూడెం మండలంలో గతంలో గ్రామ పంచాయతీలు దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టేవారు. ఫాగింగ్ కోసం గతంలో యంత్రాలు కూడా కొనుగోలు చేశారు. అయితే కొంత కాలం నుంచి ఫాగింగ్ నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో దోమల సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. అలాగే చెత్తతో మురుగు కాలువలు పూడిపోవడంతో దోమలు వాటిలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఎక్కువవుతున్నాయి. దీంతో కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ దోమల మూలంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య లోపంతో జ్వరాలు పెరుగుతున్నాయి. దీంతో మండలంలోని పీహెచ్‌సీతో పాటు పల్లెదవాఖానాలకు జ్వర పీడితులు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. కాగా సర్పంచ్‌లు మాత్రం గ్రామ పంచాయతీల్లో నిధులు లేనప్పుడు తాము ఏమి చేస్తామని చెబుతున్నారు. నిధుల కొరత వల్లే ఏమి చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల బెడద పెరుగుతోంది



గ్రామాల్లో రోజురోజుకూ దోమల సమస్య ఎక్కువవుతోంది. దోమలు కుడుతుండటంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ప్రతి ఒక్కరూ జ్వరంతో ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

– మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ ఇళ్లలో దోమ తెరలను వినియోగించాలి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి బాధితులు నిర్లక్ష్యం చేయకుండా స్థానిక పీహెచ్‌సీకైనా లేదా గ్రామంలోని పల్లెదవాఖానకైనా వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

– చిలుకూరి మణిదీప్, మండల వైద్యాధికారి

బోధన ప్రక్రియను మెరుగుపర్చాలి



యల్లయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నాగారం : ఫణిగిరిలో మాట్లాడుతున్న నోడల్ అధికారి వాసం ప్రభాకర్

అర్వపల్లి : తొలిమెట్టు ద్వారా బోధన, అభ్యసన ప్రక్రియలను మెరుగుపరచాలని తొలిమెట్టు కార్యక్రమ మండల నోడల్ అధికారి డి.యల్లయ్య కోరారు. తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం జరిగిన కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం డి. చాంప్లా నాయక్, రీసోర్స్ పర్సన్‌లు సీహెచ్. నాగరాజు, వై. శ్రీధర్, సీఆర్‌పీ ఆర్. వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, సయ్యద్ చంద్రారెడ్డి, సుధారాణి, సునీత, కరుణాకర్, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాయిలు, భిక్షం, శోభ, విజయలక్ష్మి, జయసుధ, మంజుల, శైలజ, ప్రశాంతి పాల్గొన్నారు.

నోడల్ అధికారికి సన్మానం

తొలిమెట్టు కార్యక్రమ మండల నోడల్ అధికారిగా నియమితులైన కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు డి. యల్లయ్యను మంగళవారం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషా, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యాశాఖ చేపట్టిన తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం తప్పనిసరి చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటి వరకు జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రగతి, అభ్యసన, అసెస్మెంట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నారాయణ, ఆర్పీలు నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఎల్లయ్య, సీఆర్‌పీ స్వామిగౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- బిక్కేరు వాగును తోడేస్తున్న ఇసుకాసురులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు



పేరబోయినగూడెం బిక్కేరువాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

నాగారం : నాగారం మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు అధికారులకు మస్కాకొడుతూ యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. మండల పరిధిలోని పేరబోయినగూడెం సమీపంలో ఉన్న బిక్కేరు వాగు నుంచి ఇసుక వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. నూతన రోడ్లకు, ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం, ఇతర అవసరాలకు అనుమతులతో వెళ్లాల్సిన ఇసుక యథేచ్ఛగా పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమ రవాణా జరుగుతోంది. బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు బిక్కేరు వాగులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా ఇటీవల పోలీసులు దారి మధ్యలో గొయ్యి తీశారు. అయినా ఇసుక అక్రమార్కులు ప్రత్యామ్నాయ దారుల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

రాత్రి, పగలు తేడా లేకుండా..

మండలంలో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతోంది. రాత్రి 10 గంటలకు మొదలుకొని తెల్లవారు జామున 5 గంటల వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకను నాగారం, తిరుమలగిరి, తుంగతుర్తి వంటి ప్రాంతాలకు తరలించి రూ.3,000 నుంచి రూ.4,000 వరకు విక్రయిస్తున్నారు. బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తవ్వడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, బోర్లలో నీరులేక ఎండి పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఎలాంటి కాగితాలు ఉండవు..

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు ఎలాంటి కాగితాలు ఉండడంలేదు. డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా ఉండడంలేదు. డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా ట్రాక్టర్లను అతివేగంతో నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు నిఘా పెంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



ఇటీవల ఇసుక తరలిస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేశాం. అలాగే బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా దారి మధ్యలో గొయ్యి తీశాం. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

– సైదులుగౌడ్, ఎస్‌ఐ, నాగారం

దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ



సూర్యాపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



భానుపురి : సెమీ క్రిస్మస్ కేక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఆదర్శంగా చేశారని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగులాంబ నుంచి అలంపూర్ వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి పాలైనప్పటికీ సూర్యాపేట మాత్రం బొడ్రాయిగా నిలిచి గెలిచిందని అన్నారు. కేసీఆర్ నాయకత్వం లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేకపోతున్నారని అన్నారు. మళ్లీ ఎన్నికల వరకు ఒక్కటి లేకుండా అన్ని గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జరిగిన లోటుపాట్లను ఆలోచన చేసుకోవాలని, అవి మరల పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై వారంలో స్పష్టత వస్తుందని, దానిపై ఆలోచన చేద్దామని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల తరఫున పోరాడటమే మన ప్రధాన కర్తవ్యమని అన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

భానుపురి : మానవులు ఎప్పుడూ ప్రేమ, కరుణ, క్షమను కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సూర్యాపేటలోని బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్లు, సువార్తికులు, పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి సామ్సన్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏసుక్రీస్తు ఈ లోకంలోని ప్రజలందరికీ ప్రేమ, ఆప్యాయతను నేర్పించారని, ఎదుటివారిని ప్రేమించే గుణం మనలో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రసంగికులుగా ప్రభుదాస్ మాట్లాడారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పూర్ణశశికాంత్, పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, పట్టణ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్, మరియన్న, జాకబ్, బాబురావు, డేవిడ్ రాజ్, సత్య, ప్రకాష్, లింగా నాయక్, రాజరత్నం, బొడ్డు మత్తయ్య, సాల్మన్ రాజు, మచ్చ ఏసుపాదం, మని దాసు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కబడ్డీ పోటీలు

గరిడేపల్లి : క్రిస్మస్ పండుగ సందర్భంగా రాయినిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో చే గువేరా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దోసపాటి గణేష్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు దోసపాటి గణేష్ తెలిపారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాలధారణతో ఆధ్యాత్మికత

చివ్వెంల : మాలధారణ వల్ల ఆధ్యాత్మికత పెరుగుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబు నాయక్ అన్నారు. మంగళవారం మున్యానాయక్ తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి మాలధారులు నిర్వహించిన అభిషేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్తీక మాసంలో మాలధారణ వల్ల స్వామి వారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో భానోతు సురేష్, భానోతు రాజేందర్, నరేష్‌నాయక్, నాగు, మోతీలాల్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబు నాయక్

ఉద్యోగ భద్రత లేక.. వేతనాలు సరిపోక

- ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఫీల్డ్ అసిస్టెంట్ల ఆవేదన
- ఇప్పటికైనా డిమాండ్లు నెరవేర్చాలని వేడుకోలు



వెంకెపల్లిలో ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్(ఫైల్)

నూతనకల్ : ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వకపోవడం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఉన్న కొద్దిపాటి వేతనం కూడా సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతనకల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 17మంది ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడం, జాబ్ కార్డులు మంజూరు చేయడం, హరితహారం, ఫీడర్ చానల్, మొక్కల పంపిణీ తదితర ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో ఫీల్డ్ అసిస్టెంట్లు భాగస్వాములై విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ తమకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు.

సౌకర్యాలు లేక..

ప్రభుత్వం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్ కార్డులు, బీమా సౌకర్యం కల్పించడం లేదు. పే స్కేల్ అమలు చేయడం లేదు. పనిప్రదేశాల్లో అనారోగ్యానికి గురైన వారికి ఎలాంటి పరిహారం అందడం లేదు. క్షేత్రస్థాయిలో కూలీలకు పనులు కల్పిస్తూ, పనులను పర్యవేక్షిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లకు అక్కడి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తోందని, కనీస వేతనం రూ. 18వేలు చెల్లిస్తున్నారని, సీనియార్టీ ప్రకారం పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తున్నారని.. అలాగే తెలంగాణలో కూడా తమకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అంటున్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని వాపోతున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ఉపాధి కూలీలకు పని కల్పిస్తూ నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్లకు గుర్తింపు లేదు. గత 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో దుర్భరంగా గడుపుతున్నాం. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం, బీమా సౌకర్యం కల్పించాలి.

– బసవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, వెంకెపల్లి

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న



అన్నదానం చేస్తున్న సభ్యులు

భానుపురి : అమావాస్య తిథిని పురస్కరించుకుని వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు యామా సంతోష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అమావాస్య తిథి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ రాచర్ల కమలాకర్, ఆర్పీలు రాచకొండ శ్రీనివాస్, కలకోట లక్ష్మయ్య, వాసవీ యూత్ క్లబ్ జెడ్సీ గుమ్మడివెల్లి శ్యాంసుందర్, శ్రీరంగం రాము, జెడ్సీలు మీలా మహదేవ్, జూలకంటి నాగరాజు, మిర్యాల వెంకటేశ్వర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

17న విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : నూతనకల్‌లో ఈ నెల 17న న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కంచర్ల నర్సక్క, కళ్లంచర్ల చంద్రయ్య, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజాసేవలో ముందుండాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగభూషణం

పెన్‌పహాడ్ : పోలీసు సిబ్బంది ప్రజాసేవలో ముందుండాలని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. స్టేషన్‌కు సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారి పట్ల గౌరవంగా ప్రవర్తించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకన్నగౌడ్, ఏఎస్‌ఐలు వెంకటరత్నం, శ్రీరాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



జాజిరెడ్డిగూడెంలో కేక్ కట్ చేస్తున్న కరుణకుమార్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని న్యూ ఇవాంజలిజం మినిస్ట్రీస్ స్వస్థత ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు క్రీస్తు జననం గురించి వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పాస్టర్ తీగల డేవిడ్‌రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, గొల్లబోయిన అక్కులు, రెంటాల కరుణకుమార్, విజయ్, నరేష్, సుధీర్, శకుంతల, రూతమ్మ, లక్ష్మి, రేణుక, సుమలత, వసంత, మరియమ్మ, శిరీష, నాగమ్మ పాల్గొన్నారు.

దాతల సహకారంతో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం దాతల సహకారంతో అయ్యప్ప మాలధారులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన గాయం శ్రీనివాసరెడ్డి –శిల్ప దంపతులు రూ.ఐదు వేలు, ఉప్పుల జానకిరెడ్డి –రజిత దంపతులు రూ.ఐదు వేలు, పెంటకొట్లు సురేష్‌స్వామి, భక్తపీఠం స్వాములు రూ.ఐదువేలు, చిలుకూరు మండలం ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన అందె ఫణీంద్ర రూ.వేయి విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్లు సురేష్‌స్వామి, వల్లోజు వెంకన్న, బొబ్బిలి సంజీవరెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.



మునగాలలో అన్నదానం చేస్తున్న దాతలు

శ్రీనివాస్ ఆశయ సాధనకు కృషిచేయాలి



చిలుకూరులో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, సీపీఐ నాయకులు

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం చిలుకూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్‌యాదవ్ మరణంతో సీపీఐ శక్తివంతమైన నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి ప్రజాసమస్యలపై ప్రశ్నించేతత్వము, సత్తా కేవలం సీపీఐకే ఉందన్నారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన చిలుకూరు మండలం చాలా చైతన్యవంతమైనదని అన్నారు. ఆ చైతన్యంతో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ చిత్రపటానికి ఆయన భార్య కళావతి, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ పేరుతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాక్ శిక్షణ

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని సిరిపురంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గ్రామీణ భవన నిర్మాణ కార్మికులకు వృత్తి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వారికి ట్రైనర్ కరుణసాగర్ శిక్షణ ఇస్తున్నారు. 30 మంది కార్మికులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు.